**కథ**

# అవగాహన

**పక్కమీద పడుకుందన్న మాటే గానీ ఎంత ప్రయత్నిస్తున్నా సుధకు నిద్ర రావడం లేదు. ఎడతెరిపి లేని ఆలోచనలు ఆమె మెదడును తొలిచేస్తున్నాయి. ఉదయం వదిన అన్న మాటలు ఆమె గుండెల్లో గునపాల్లా గుచ్చుకున్నాయి.**

"నీ భర్తకుంది గనుక నీకూ ఎయిడ్స్ ఉండి ఉంటుంది. నా పిల్లలను నువ్వు ముట్టుకోవద్దు" అని ఎంత నిష్కర్షగా చెప్పింది.

అమ్మ కూడా వదినకే వత్తాను పలుకుతోంది. ఇక పెద్దన్నయ్య అయితే వదిన మాటే జవదాటడు. ఏమీ తోచక ఏదైనా సాయం చేయబోతే "నీకెందుకు? నీ గదిలో ఉండచ్చు కదా" అని అందరూ కసిరేస్తున్నారు. అందుకే గది దాటి బైటికి వెళ్లడమే మానుకుంది. భోజన ఫలహారాలన్నీ ఆమెకు గదిలోకే అందుతున్నాయి. రోజురోజుకీ పరిస్థితి దయనీయంగా మారుతోంది.

ఇదివరకు అందరూ నన్నెంత అపురూపంగా చూసేవారు! ఆయనకు నాకు ఎంత మర్యాద చేసేవారు! ఆయనకీ వ్యాధి వచ్చిందని తెలిశాక అంతా తారుమారైంది. అందరి ప్రవర్తనలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

పెళ్లయి ఏడాది నిండనే లేదు. అప్పుడే ఎన్ని సమస్యలు. ఆయన ఎలా ఉన్నారో! నన్నెంత బాగా చూసుకునేవారు. ఆయన చూపించే ప్రేమ వల్లే నాన్న హార్ట్ అటాక్ వచ్చిపోయిన బాధ నుంచి తేరుకోగలిగింది. 'అటువంటి భర్త దొరకడం నీ అదృష్టం' అంటూ అంతా పొగిడే వారు. దేవతల్లాంటి అత్తామామలు, అపురూపంగా చూసుకునే భర్త నా జీవితానికి లోటే లేదని మురిసిపోయినందుకు నా దిష్టే తగిలిందేమో. జ్వరం వచ్చి ఆయన హాస్పిటల్‌కి వెళితే...బ్లడ్ టెస్ట్‌లు చేసి హెచ్.ఐ.వి. సోకిందని చెప్పారట. పర స్త్రీలతో సంబంధం ఉన్న వారికే ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుందని ఎవరో అంటే వింది. ఇన్నాళ్లూ ఆయన ఎంతో మంచి వారని నమ్మింది. నువ్వే సర్వస్వమంటూ నీపై ప్రేమ కురిపిస్తున్న ఆయన ఇలాంటి పని చేయడాన్ని భరించలేకపోయింది. ఇక అతనితో కలిసి ఉండటం ఇష్టం లేక ఎవరికీ చెప్పకుండానే వెంటనే ఇక్కడికి వచ్చేసింది.

కానీ ఇక్కడ అందరూ ఆయన విషయం తెలుసుకుని నన్ను ఓ వ్యాధిగ్రస్థురాలిగా చూస్తుంటే భరించలేకపోతోంది. ఒకవేళ వదిన అన్నది నిజమేనేమో! నాకూ హెచ్.ఐ.వి. సోకి ఉంటుందా? ఆలోచిస్తుంటేనే ఆమె ఒడలంతా భయంతో కంపించిపోతోంది. అదే నిజమైతే ఈ అవమానాలు, అవహేళనలు భరిస్తూ ఇలా బ్రతకాల్సిందేనా! ఆమెకు భవిష్యత్తు అగమ్యగోచరంగా తోస్తోంది. రేపు చిన్నన్నయ్య వస్తాడట. అన్నయ్య డాక్టరు కదా! ఏం చెబుతాడో చూడాలి. 'ఏదో ఒక పరిష్కారం దొరక్క పోతుందా' అని కొండంత ఆశతో ఉంది సుధ.

* * *

మధు వచ్చాక ఆ ఇంటి వాతావరణంలో చాలా మార్పు వచ్చింది. పిల్లలిద్దరూ బాబాయి మీద ఎక్కి అల్లరి చేసేస్తున్నారు. అంతా సందడిగా ఉంది. కుశల ప్రశ్నలు అయ్యాయి.

"అమ్మా! సుధ ఏదీ? నేను వచ్చి ఇంతసేపైనా కనిపించనే లేదు"! అడిగాడు మధు ఒకింత ఆశ్చర్యంగా.

"పడుకున్నట్లుంది తన గదిలో" అంది దేవకి నిర్లిప్తంగా.

"ఏం? ఒంట్లో బాగోలేదా" ఆదుర్దాగా అడిగాడు.

"ఏమో! మొగుడి రోగం దీనికే వచ్చిందేమో! ఎప్పుడూ ఉసూరంటూ ఉంటుంది" అంది.

"అమ్మా! ఏమిటా మాటలు? సుధ వింటే ఎంత బాధపడ్తుంది" కోపంగా అన్నాడు.

"నిజమే కదా మధూ! అత్తయ్యగారు అన్నదాంట్లో తప్పేముంది? ఒకసారి సుధకూ పరీక్ష చేయిస్తే మంచిది. అసలే చిన్నపిల్లలున్న ఇల్లు. అయినా సుధకైనా తెలియాలి. పిల్లల్ని గబగబా ఎత్తుకుంటుంది. అన్ని పనుల్లోనూ తల దూరుస్తుంది. నువ్వయినా చెప్పు తన లిమిట్స్‌లో తను ఉండాలి. తన రోగం అందరికీ అంటగట్టకూడదు కదా" అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది మధు వదిన లత.

"వదినా"! గట్టిగా అరిచాడు మధు. "ఏమిటి? మీరు చేస్తున్నదేమిటి? దాన్ని మాటలతో చంపేస్తున్నారా ఇలాగే. అమ్మా నీకైనా తెలియద్దూ! కన్నకూతుర్ని ఇలా ఎలా అనగలుగుతున్నారు? ఇన్నాళ్లూ దానిపై చూపించిన ప్రేమంతా ఏమైపోయింది? ఇంత నిర్దాక్షిణ్యంగా ఎలా ప్రవర్తిస్తున్నారు? సుధకు ధైర్యం చెప్పవలసింది పోయి మీరే సాధిస్తున్నారా" అని తల్లిని, వదినను గద్దించాడు.

"ఏం చేయమంటావురా! దాని భర్తకి వచ్చింది అంటు రోగం. మరి దీనికీ ఉండకుండా ఉంటుందా! కన్నకూతురనే ప్రేమ వల్లే కదా దాన్ని ఇంట్లో ఉండనిచ్చాం. అలాగని జాగ్రత్తగా ఉండకపోతే అందరికీ ఆ రోగం అంటుకోదూ" అమాయకంగా అంది దేవకి.

మధుకి అక్కడి పరిస్థితి పూర్తిగా అర్థమైంది.

"సుధా! సుధా!" హాలులోంచే చెల్లెల్ని పిలిచాడు మధు.

సుధ నెమ్మదిగా ఆ గదిలోకి వచ్చింది. ఆమె వదనం అతి దయనీయంగా ఉంది. నలిగిన చీరతో, చెదిరిన జుట్టుతో శోకదేవతలా ఉంది. ఎప్పుడూ లేడిలా చలాకీగా తిరిగే సుధ ఇప్పుడు జీవచ్ఛవంలా నడిచి వస్తోంది. తన చిట్టిచెల్లెల్ని ఆ రూపంలో చూసి అతని మనసు ద్రవించిపోయింది.

"ఏంరా సుధా! ఏమిటలా ఉన్నావు? ఇప్పుడేమైందని?" అని సుధను తన దగ్గరికి తీసుకున్నాడు.

"అన్నయ్యా!" అంటూ బోరుమని ఏడ్చింది సుధ.

గుండెల్లో గూడుకట్టుకున్న బాధంతా తీరేవరకూ ఆమెనలా ఏడవనిచ్చాడు.

సుధ కాస్త స్థిమితపడ్డాక మధు మాట్లాడటం ప్రారంభించాడు.

"సుధా! ఇక్కడి పరిస్థితి అంతా వచ్చిన ఈ కాసేపటిలోనే నాకు అర్థమైంది. ఇక్కడ నువ్వెంత నరకం అనుభవిస్తున్నావో, అక్కడ తేజా కూడా ప్రాణాధికంగా ప్రేమించిన భార్య తనని అపార్థం చేసుకుని వెళ్లిపోయిందని అంత కన్నా ఎక్కువే బాధ పడుతున్నాడు. భర్తకు ఆరోగ్యం బాగోనప్పుడు దగ్గర ఉండాల్సింది పోయి నువ్వు ఇలా వచ్చేయడమేమిటి?" అని సుధ నిలదీశాడు.

"అది కాదన్నయ్యా! ఆయనెంతో మంచివారనుకున్నాను. కానీ ఆయనకు హెచ్.ఐ.వి. వచ్చింది. అంతే ఆయన చెడుతిరుగుళ్లు తిరుగుతున్నట్లే కదా.. అందుకే ఆయనంటే అసహ్యం వేసి వచ్చేశాను" అంది చిన్నపిల్లలా.

"చాలా పొరపాటు పడ్డావమ్మా! తేజ అటువంటి వాడు కాదు. ఈ వ్యాధి చెడుతిరుగుళ్లు వల్లే కాకుండా కలుషితమైన సూదులు, సిరంజిలు, రక్తమార్పిడిల వల్ల కూడా సోకే అవకాశముంది. నీకు ఎయిడ్స్ వ్యాధి గురించి సరైన అవగాహన లేక నీ భర్తను అపార్థం చేసుకున్నావు. తేజ నాకు ఫోన్ చేసి అన్ని విషయాలూ చెప్పాడు. కొంత కాలం క్రితం వాళ్ల తాతగారి ఊరు వెళ్లినప్పుడు ఫీవర్ వస్తే అక్కడ ఇంజక్షన్ చేయించుకున్నాడట. బహుశ అది కలుషితమైనదై ఉండవచ్చని, దానివలనే తనకీ వ్యాధి సోకి ఉండాలని, తనకి ఎప్పుడూ ఏ బాడ్ హాబిట్స్ లేవని తన తల్లిపై ఒట్టు వేసి మరీ చెప్పాడు. ఓ విషయం నువ్వు స్పష్టంగా తెలుసుకోవాలి సుధా...నిజంగానే నీ భర్తకి చెడు అలవాట్ల వల్ల ఈ వ్యాధి సోకినా.. నీ భర్త తప్పును నువ్వు క్షమించి అతనికి అండగా ఉండాల్సింది ఈ సమయంలోనే. ప్రతి పొరపాటుకీ భార్యాభర్తలు విడిపోవడమే పరిష్కారమైతే ఇక వివాహ బంధానికి అర్థం ఏముంది? మూడుముళ్ల విలువేముంది?" అని సుధను ప్రశ్నించాడు.

"సారీ అన్నయ్యా నేను మూర్ఖంగా ప్రవర్తించానని ఇప్పుడనిపిస్తుంది" అంది సుధ బాధపడుతూ.

"సరేలేమ్మా జరిగిందేదో జరిగిపోయింది. ఇక జరగాల్సిన

**ఎస్. ఇందిరా నాగేశ్వరరావు**

దాని గురించైనా తెల్సుకొని జాగ్రత్త పడండి. హెచ్.ఐ.వి. సోకిన వారికి ముఖ్యంగా కావల్సింది సానుభూతి, ఆదరణ, అప్యాయతలు, వారు కలత చెందకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులందరిపైనా ఉంది. హెచ్.ఐ.వి. దశ నుండి ఎయిడ్స్ దశకు చేరుటకు 8 నుంచి 10 సంవత్సరాలు పడుతుంది. ఇమ్యూనిటీ పవర్ తగ్గకుండా మంచి ఆహారం తీసుకుంటూ, తగిన వైద్యం పొందుతూ ఉంటే ఎయిడ్స్ రాకుండా ఆరోగ్యాన్ని మరికొంత కాలం కాపాడుకోవచ్చు. సెక్స్ ద్వారా భర్త నుంచి భార్యకు కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉన్నా, ఇమ్యూనిటీ పవర్ ఎక్కువ ఉన్న వారికి అది సంక్రమించే అవకాశం తక్కువ. అయినా అనుమాన నివృత్తి కొరకు నువ్వూ హెచ్.ఐ.వి. టెస్ట్ చేయించుకో. ఒకవేళ నీకూ పాజిటివ్ వచ్చినా బెంబేలు పడవద్దు. మంచి ఆహారంతో, మందులతో మీ జీవితకాలాన్ని పెంచుకునే ప్రయత్నం చేయండి" అని అన్నీ వివరంగా చెప్పాడు మధు.



"అమ్మా! వదినా! మీకూ కొన్ని విషయాలు చెబుతాను వినండి. హెచ్.ఐ.వి. సోకిన వారితో కలిసి ఉండటం వల్ల, మాట్లాడం వల్ల కలిసి భుజించడం వల్ల ఎంత మాత్రమూ చెరువు జరగదు. మీకు తెలిసీ తెలియని నాలెడ్జితో సుధను ఎంతో బాధపెట్టారు" అన్నాడు.

సుధ పట్ల తమ అనుచిత ప్రవర్తనను తలుచుకుని దేవకి, లత సిగ్గు పడ్డారు.

"సారీ సుధా! నిన్ను చాలా బాధపెట్టాను" అంది లత బిడియంగా సుధ దగ్గరకు వచ్చి.

"పర్వాలేదులే...వదినా! చెడి పుట్టింటికి వస్తే ఎంత గౌరవం లభిస్తుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అయినా నేను చేసిందీ తప్పేగా. ఆయనను అన్యాయంగా అపార్థం చేసుకుని వచ్చేసినందుకు నాకీ శిక్ష తక్కువే. నాకు ఒక విషయం బాగా అర్థమైంది. కష్టమైనా సుఖమైనా ఆడది అత్తింట్లో ఉంటేనే ఆమెకు గౌరవం" అన్నది.

కూతురి మాటల్లో నిష్టూరాలు అర్థమై దేవకి సిగ్గుతో తలదించుకుంది.

"అన్నయ్యా! వెంటనే మా వారి దగ్గరకు వెళ్దాము. నువ్వూ రా అన్నయ్యా" అంది సుధ వేడికోలుగా.

"సరే...పద.. త్వరగా రెడీ అవ్వుమరి" అన్నాడు మధు.

★ ★ ★

సుధని, మధుని చూసి తేజ మొహంలో ఆనందం తాండవించింది. అత్తగారు కూడా కోడలిని చూసి సంతోషించి సాదరంగా ఆహ్వానించింది. చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయిందన్న కోపమేమీ ప్రదర్శించని వారి సంస్కారానికి సుధ కంట నీరు తిరిగింది.

"నన్ను క్షమించండి.. మిమ్మల్ని పొరపాటుగా అర్థం చేసుకున్నాను. మా చిన్నన్నయ్య నా కళ్లు తెరిపించాడు" అని భర్త పక్కన కూర్చుని అతని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంది.

"అందరిలాగే నువ్వూ ఆలోచించావు. ఇప్పుడు తెల్సుకున్నావు. అంతే చాలు. నువ్వు వచ్చేశావుగా. ఇక నాకే అనారోగ్యమూ ఉండదు" అన్నాడు తేజ భార్య వంక ప్రేమగా చూస్తూ.

తేజ రిపోర్ట్స్ అన్నీ వెరిఫై చేశాడు మధు. అతను వాడుతున్న మందుల వివరాలు తెలుసుకున్నాడు. డాక్టరు సలహాతో యాంటీ వైరల్ డ్రగ్స్ వాడినట్లయితే అది జీవితకాలాన్ని పొడిగిస్తుందని కొన్ని సలహాలు, సూచనలు చెప్పాడు. సుధకూ హెచ్.ఐ.వి. టెస్ట్ చేయించి, ఇద్దరూ తప్పనిసరిగా కౌన్సిలింగ్ తీసుకోవాలని చెప్పాడు. "సెక్స్‌లో పాల్గొన్న ప్రతీసారీ కండోమ్‌ని ఉపయోగించాల"ని తేజకు, "సంతానం కావాలనుకుంటే పుట్టబోయే బిడ్డకు ఈ వ్యాధి సోకకుండా చికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని" సుధకు విడమర్చి చెప్పాడు.

ఎయిడ్స్ వచ్చినా హేపీగా జీవిస్తున్న వారిని ఉదాహరణగా చెబుతూ, "వారిలా ధైర్యంగా మీరూ జీవితం పట్ల ఆశతో జీవించాలని" మరీ మరీ చెప్పాడు.

అతని మాటలు విన్నాక సుధకు, తేజకు ఎంతో ధైర్యం, ఉత్సాహం వచ్చాయి.

"ప్రస్తుతం ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచడం కోసం ప్రయత్నిస్తున్నాం. మెడికల్ ఆఫీసర్‌గా నాకెన్ని బాధ్యతలుంటాయో మీకూ తెలుసుగా. మీ విషయం తెలిసి మీకూ అవగాహన కలిగించడం కోసం వచ్చాను.. ఇక నేను వెళతాను" అని లేచాడు మధు.

"థాంక్స్ అన్నయ్యా! నువ్వు చెప్పిన విషయాలన్నీ మాకు జీవితం పట్ల ఆశను పెంచుతున్నాయి" అంది సుధ కృతజ్ఞతగా.

"వెరీగుడ్ సుధా! నేను చెప్పినవి జాగ్రత్తగా ఫాలో అవండి. డౌట్స్ ఏవైనా వస్తే నాకు ఫోన్ చెయ్యండి. బి బ్రేవ్" అని చెప్పి వెళ్లిపోతున్న అతన్ని సుధ, తేజ రెప్పవేయకుండా అలా చూస్తుండిపోయారు. వారి కళ్లకు అతను చీకటిని పారద్రోలి వెలుగును ప్రసాదించే సూర్యుడులా అగుపిస్తున్నాడు.